యోగాతో ఒత్తిడిని జయించొచ్చు

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం యోగా మెడిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్ మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే ఇంటర్ పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు మానసిక ఒత్తిడి జయించి మంచి ఉత్తీర్ణత సాధించేందుకు ఈ యోగా, మెడిటేషన్ దోహద పడనుందన్నారు. మెడిటేషన్ ద్వారా మానసిక ఆరోగ్యాన్ని ఎలా పొందవచ్చు అనే అంశంపై సంస్థ ప్రతినిధులు విజయలక్ష్మి, సత్య ఆధ్వర్యంలో విద్యార్థులకు వివరించారు.

పరిసరాలను శుభ్రం చేసిన పోలీసులు


పీఎస్ పరిసరాలను శుభ్రం చేస్తున్న పోలీసులు

జీడిమెట్ల: నిత్యం ప్రజారక్షణ, శాంతిభద్రతలో భాగంగా చేతిలో లాఠీలు, తుపాకులు పట్టుకోవాల్సిన పోలీసులు పలుగు, పార, చీపురు చేత పట్టారు. సమాజంలో ఉన్న అల్లరిమూకలు, రౌడీలను ఊడ్చాల్సిన చేతులతో చెత్తాచెదారాలను ఊడ్చేశారు. ఇదేంటి అనుకుంటున్నారా.. ఇది నిజమే శనివారం జీడిమెట్ల పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్ సిబ్బంది ఉదయాన్నే స్టేషన్‌కు చేరుకుని ఆవరణలో ఉన్న చెత్తను, కలుపు మొక్కలను తొలగించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. పోలీసులు ఆదర్శంగా ఉండాలన్నారు. మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవడం బాధ్యతగా తీసుకోవాలని ఆయన సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ బతుకమ్మ బండలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌తో బస్తీ వాసులకు కరెంటు కష్టాలు తీరనున్నాయి. బస్తీలో నెలకొన్న లోఓల్టేజీ సమస్యపై సంక్షేమ సంఘం నాయకుడు చెట్ల వెంకటేష్ ఆధ్వర్యంలో బస్తీ వాసులు ఎమ్మెల్యే వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. శనివారం విద్యుత్ శాఖ అధికారులు నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మంజుల, చందన, సాయి కిరణ్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



జగద్గిరిగుట్ట: చింతల్, శ్రీసాయి కాలనీలోని ఆంజనేయ, పోచమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం అభిషేకం, అర్చన, అలంకరణ తదితర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ చైర్మన్ కన్నెకంటి లక్ష్మణ్, ప్రెసిడెంట్ కల్యాణ్ రావు పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నిజాంపేట్ : మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, కార్మికులపై అధికారుల వేధింపులను అరికట్టాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ అన్నారు. శనివారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రగతి నగర్‌లోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతనంలో కోతలు విధిస్తున్నారని వాటిని తక్షణమే అరికట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు పెంటయ్య, వెంకన్న, స్వామి, సత్యనారాయణ, చెన్నయ్య, మనీ, వెంకటమ్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. భాగ్యలక్ష్మి కాలనీకి చెందిన పద్మ(32), సతీష్‌లు భార్యాభర్తలు. అమలాపురానికి చెందిన పద్మ ఐసీఐసీఐ బ్యాంక్‌లో లోన్ రికవరీ ఏజెంట్‌గా పని చేస్తోంది. సతీష్ దొడ్ల డెయిరీలో ఏజెంగా పని చేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య ఇటీవల గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పద్మ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.





ఆకట్టుకున్న రంగవల్లులు

ఎస్‌పీఆర్ గ్లోబల్ స్కూల్ సౌజన్యంతో 'సాక్షి' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

పది రోజుల ముందే అక్కడ సంక్రాంతి పండుగ వాతావరణం ఏర్పడింది. గాజుల రామారం డివిజన్ చిత్తారమ్మ దేవి నగర్‌లోని ఎస్‌పీఆర్ గ్లోబల్ స్కూల్ సౌజన్యంతో 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం జరిగిన సంక్రాంతి ముగ్గుల పోటీలు అంబరాన్నంటాయి. పల్లె వాతావరణం, సంస్కృతీసంప్రదాయాలు ఉట్టిపడేలా హరిదాసుల కీర్తనలు, సోది చెప్తా నమ్మ సోది అని అంటూ.. మరోవైపు గంగిరెద్దుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వీటిని తిలకించేందుకు చుట్టుపక్కల వారు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నగరంలో పల్లెటూరిల మారిపోయిన ఎస్‌పీఆర్ గ్లోబల్ స్కూల్‌ని చూసి ముచ్చటపడ్డారు. న్యాయ నిర్ణేతలుగా అనూష, రాధిక, గ్లోరీలు వ్యవహరించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతీ మహిళకు బహుమతులు అందజేయడమే కాకుండా పోటీల్లో ప్రథమ బహుమతి సాయిని శ్యామల, ద్వితీయ బహుమతి సంగీత, తృతీయ బహుమతి ప్రవళికకు చీరలను స్కూల్ చైర్మన్ సొంటి రెడ్డి పున్నారెడ్డి, చైతన్య రెడ్డి, కుత్బుల్లాపూర్ సాక్షి ఇన్‌చార్జి రంగు వెంకటేష్ గౌడ్ అందజేశారు. – సుభాష్‌నగర్





పది రోజుల ముందే పండుగ వాతావరణం



'సాక్షి' దినపత్రిక ప్రతి సంవత్సరం సంక్రాంతి ముగ్గుల పండుగను ఏర్పాటు చేయడం అభినందనీయం. ఇలాంటి కార్యక్రమాలు చేయడం ద్వారా సంక్రాంతి పండుగ యొక్క గొప్పదనాన్ని తెలియజేసినట్లు అవుతుంది. పది రోజుల ముందే కార్యక్రమాన్ని చేపట్టడంతో పల్లెటూరి వాతావరణం సంతరించుకుంది. – సొంటి రెడ్డి పున్నారెడ్డి, ఎస్‌పీఆర్ గ్లోబల్ స్కూల్ చైర్మన్


శ్యామలకు మొదటి బహుమతి అందజేస్తున్న ఎస్‌పీఆర్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ పున్నారెడ్డి


సంగీతకు రెండో బహుమతి అందజేస్తున్న చైతన్య రెడ్డి


ప్రవళికకు మూడో బహుమతి అందజేస్తున్న కుత్బుల్లాపూర్ 'సాక్షి' ఇన్‌చార్జి రంగు వెంకటేష్‌గౌడ్















వసతుల కల్పనలో కార్పొరేషన్ విఫలం

నిజాంపేట్ : మౌలిక వసతుల కల్పనలో కార్పొరేషన్ విఫలమైందని బీజేపీ నిజాంపేట్ అధ్యక్షులు భిక్షపతి యాదవ్ అన్నారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కార్పొరేషన్‌కు వచ్చిన ప్రతీసారి కార్పొరేషన్‌ను ఆదర్శ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తామని చెప్పి విస్మరిస్తున్నారన్నారు. అధికారులు సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దాసి నాగరాజు, ప్రధాన కార్యదర్శి సచిన్, అశోక్, బిల్డర్ సెల్ కన్వీనర్ పద్మ ప్రసాద్, స్పోక్స్ పర్సన్ సంతోష్, బీజేవైఎం అధ్యక్షులు నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేష్, సీనియర్ నాయకులు అజయ్ కుమార్, ఒకటవ డివిజన్ అధ్యక్షులు కాటంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం


సమావేశంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం మేయర్ నీలాగోపాల్ రెడ్డి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. మంజూరైన అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులు, నిర్మాణ దశలో ఉన్న పలు అభివృద్ధి పనులు, టెండర్ దశలో ఉన్న పనులు, అవసరంలేని/సైట్ వివాదం వంటి పనులు, వాటి నిధుల వివరాలు తదితర విషయాలపై చర్చించారు. ఆయా డివిజన్ల పరిధిలో నెలకొన్న పలు సమస్యలు, వాటి పరిష్కారం వంటి కీలక అంశాలపై ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలు చేశారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కమిషనర్ సాబెర్‌అలీ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆలయంలో లక్ష పుష్పార్చన

జగద్గిరిగుట్ట: చింతల్, పద్మానగర్ ఫేజ్ 1లో శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలో భాగంగా లక్ష పుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.


కొలువుదీరిన వేంకటేశ్వర స్వామివారు


లక్ష పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు


పూజలో కౌన్సిలర్ శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ తనయుడు దీపక్‌రావు

దుండిగల్: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జన్మదినం సందర్భంగా దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ కొర్ర శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో శనివారం నర్సాపూర్‌లోని సహకార ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తనయుడు దీపక్‌రావుతో కలిసి ఆలయంలో నిత్య అన్నదానం కోసం బియ్యం, సరుకులను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌నాయక్, గాలి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాయికిషోర్

జీడిమెట్ల: జీడిమెట్లలోని అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేసి జీడిమెట్ల ఇండస్ట్రియల్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా సాయికిషోర్, వైస్ ప్రెసిడెంట్‌గా రంగరాజు, ప్రధాన కార్యదర్శిగా పి.శ్రీనివాసులురెడ్డి, ట్రెజరర్‌గా డి.కరుణ్, సభ్యులుగా శ్రీనివాస్‌రెడ్డి, కిషోర్‌పటేల్, సౌమ్య, శ్రీనివాసరాజు, జీకే చౌదరి, భాస్కరరాజు, శ్రీనివాసరాజు, అభినవకుమార్‌రెడ్డి, కోటేశ్వరరావులను ఎన్నుకున్నారు. అనంతరం ప్రెసిడెంట్ సాయికిషోర్ మాట్లాడుతూ.. తన విధులను బాధ్యతగా నెరవేరుస్తూ పారిశ్రామికప్రాంత అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానని అన్నారు.


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

రిటైర్డ్ అధికారుల సేవలు సమాజానికి అవసరం

కుత్బుల్లాపూర్: వయస్సు రీత్యా ప్రభుత్వ నియమ నిబంధనలకు మాత్రమే రిటైర్డ్ అధికారులని, మీ సేవలు సమాజానికి ఎల్లప్పుడూ అవసరమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ స్థలాన్ని కేటాయించేందుకు తన వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు భృంగి గోవర్ధన్, ఉపాధ్యక్షులు బి. శ్రీధర్ రావు, జాయింట్ సెక్రెటరీలు పి. సాంబశివరావు, సీహెచ్. సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మాల కొండయ్య, వాజీర్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసిన రిటైర్డ్ పోలీస్ అధికారులు

కార్పొరేషన్‌కు రూ.169 కోట్ల నిధులు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రూ.169 కోట్లు జమ చేశారు. ఇంత కాలం కార్పొరేషన్ ఖజానా ఖాళీగా ఉండటంతో అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదే విధంగా నూతనంగా చేపట్టే పనులను సైతం చేపట్టలేకపోయారు. శనివారం ఈ నిధులు మంజూరు కావడంతో పాలక వర్గం సంతోషం వ్యక్తం చేసింది. నిజాంపేట్ ట్రెజరీకి 5 సంవత్సరాలకు గాను రాష్ట్ర రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ నుంచి రావలసిన రూ.169 కోట్ల 77 లక్షల 4,250 జమ అయ్యాయి. నిధుల జమ పట్ల మేయర్ కొలను నీలా గోపాల్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

1.2 కిలోల గంజాయి స్వాధీనం

కుత్బుల్లాపూర్: ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో గాజులరామారంలోని అంబేడ్కర్‌నగర్‌లో శనివారం 1.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఎస్‌టీఫ్ టీం దాడులు నిర్వహించగా.. మహ్మద్ సలాం అనే వ్యక్తి గంజాయి అమ్ముతున్నట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు గంజాయి ఎక్కడి నుంచి వస్తుంది, దీని వెనుక ఇంకా ఎవరు ఉన్నారనే కోణంలో ఆరా తీస్తున్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు విరాళం



నిజాంపేట్: మధురానగర్ కాలనీలో నిర్మిస్తున్న అష్టలక్ష్మీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు కాలనీకి చెందిన జి.వెంకటేశ్వరరావు- మహాలక్ష్మి దంపతుల కుమారుడు ఆదర్శ్ రూ.2 లక్షల విరాళాన్ని శనివారం అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు విరాళం అందజేసిన కుటుంబ సభ్యులను సన్మానించారు. దాతలు వస్తురూపేణ, ధనరూపేణ సమర్పించాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విష్ణువర్ధన్‌రావు, రాంబాబు, మద్దయ్య, రామలక్ష్మారెడ్డి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.